

బాధితులకు న్యాయం చేయాలి

వివిధ సమస్యలపై పోలీసుస్టేషన్‌కు వచ్చే బాధితులకు సత్వరమే న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ ఈ.జి.అశోక్‌కుమార్ పేర్కొన్నారు.

-8లో



చేయి తడిపితేనే.. ఫైల్ ముందుకు

మైలవరం తహసీల్దార్ కార్యాలయం అవినీతిలో కూరుకుపోయింది. అక్రమమైనా.. సక్రమమైనా చేయి తడిపితేనే ఫైల్ ముందుకు కదులుతుంది.

-8లో

గరిష్ఠం/కనిష్ఠం
34.0/24.8

వాతావరణం

జిల్లాలో శుక్రవారం 24.8 - 34.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

రూ.10 కోట్లకు వ్యాపారి ఐపీ

ముద్దనూరు: మండలంలోని ఉప్పలూరు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కోట్లాది రూపాయలు అప్పులు చేసి ఐపీ పెట్టినట్లు సమాచారం. మెడికల్ ఏజన్సీ వ్యాపారం నిర్వహిస్తూ పలువురి వద్ద భారీగా సదరు వ్యక్తి అప్పులు చేసినట్లు తెలుస్తోంది. గత వారం రోజుల నుంచి ఈ వ్యాపారి కోట్లాది రూపాయలకు ఐపీ పెట్టినట్లు బాధితులకు తెలియడంతో పలువురు పోలీసులను ఆశ్రయించినట్లు సమాచారం. మెడికల్ ఏజన్సీ నిర్వహిస్తూ సుమారు రూ.10ల వడ్డీకి కూడా అప్పులు తీసుకున్నట్లు, దీంతో అప్పులు అధికమైనట్లు వినికిడి. ఐపీ పెట్టిన వ్యక్తికి విజయవాడ, అనంతపురం, కడప, తాడిపత్రి, ముద్దనూరు మండలాలకు చెందిన సుమారు 20 మంది వరకు అప్పులు ఇచ్చినట్లు, ఇతను సుమారు రూ.10 కోట్ల మేర అప్పులు చేసినట్లు ప్రస్తుతానికి బయటపడినట్లు తెలుస్తోంది. భారీగా అప్పులు చేసి ఐపీ పెట్టిన సమాచారం అందడంతో బాధితులు బెంబేలెత్తుతున్నారు.

24న షూటింగ్‌బాల్ జట్ల ఎంపిక

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణ సమీపాన ఉన్న పుంగనూరురోడ్డులోని గ్రీన్‌వ్యాలీ పాఠశాలలో ఈ నెల 24న జిల్లా బాల,బాలికల షూటింగ్‌బాల్ జట్ల ఎంపిక జరుగుతుందని జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి గౌతమి తెలిపారు. క్రీడాకారులు ఉదయం 9 గంటలకు హాజరు కావాలని ఆమె పేర్కొన్నారు. 2006 ఏప్రిల్ 1 తరువాత పుట్టిన వారు అయి ఉండాలన్నారు. ఆధార్‌కార్డు తీసుకుని రావాలన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ : 6281881022ను సంప్రదించాలని వివరించారు.

12 అంశాలతో కళా ఉత్సవ్ పోటీలు



కళా ఉత్సవ్ రిజిస్ట్రేషన్లు ప్రారంభిస్తున్న నోడల్ అధికారి నరసింహారెడ్డి

రాయచోటి జగదాంబసెంటర్: విద్యార్థుల్లో కళాత్మక నైపుణ్యాలు పెంపొందించడమే లక్ష్యంగా 12 అంశాలతో కళా ఉత్సవ్ - 2025 పోటీలు నిర్వహిస్తున్నట్లు కళా ఉత్సవ్ జిల్లా నోడల్ అధికారి మడితాటి నరసింహారెడ్డి తెలిపారు. స్థానిక డైట్ కళాశాలలో కళా ఉత్సవ్ - 2025కు సంబంధించిన రిజిస్ట్రేషన్లను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాత్ర సంగీతం, వాయిద్య సంగీతం, నృత్యం, నాటకం, దృశ్యకళలు, సంప్రదాయ కథ చెప్పడం వంటి 12 అంశాల్లో పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి కడప జిల్లాలోని 50 మండలాలకు చెందిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గుర్తింపు పొందిన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న 9, 10, 11, 12వ తరగతుల విద్యార్థులు ఈ పోటీలకు అర్హులని వివరించారు. పోటీల్లో పాల్గొనే వారు రాయచోటి డైట్ కళాశాలలో వ్యక్తిగతంగా గానీ 9440246825 నంబర్‌కు వాట్సాప్ ద్వారా గానీ, గూగుల్ ఫామ్ ద్వారా గానీ తమ పేర్లు నమోదు చేసుకోవాలని వివరించారు.

ప్రాణాలు తోడేస్తున్నారు!

కొండలు.. గుట్టలు.. వాగులు.. వంకలు.. ఏవైనా టీడీపీ నాయకుల అక్రమ దోపిడీకి విలవిలలాడుతున్నాయి. ఇసుక, మట్టిని నిబంధనలకు విరుద్ధంగా తవ్వుకుని.. అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. కూటమి ఏడాదిన్నర పాలనలోనే అక్రమార్కులు ఎంత బరి తెగించారో.. తవ్విన ప్రదేశాల్లో ఏర్పడిన గోతులు చూస్తేనే తెలుస్తోంది. వాటి వద్ద ఎలాంటి రక్షణ చర్యలు లేక ప్రమాదకరంగా మారాయి. గోతుల్లో నీరు నిలవడంతో.. సరదాగా ఈతకు అని దిగిన అమాయకుల ప్రాణాలు తీస్తున్నాయి.

- మృత్యుకుహరాలుగా మారిన గోతులు
- ఇసుక, మట్టిని దోచేసిన తమ్ముళ్లు
- ప్రమాదకరంగా నదులు, చెరువులు, వాగులు





బాలరాచపల్లె సమీపంలోని బహుదానదిలో ప్రమాదకరంగా కనిపిస్తున్న మడుగులు (ఇన్‌సెట్) చెయ్యేరు నదిలో మృతి చెందిన యువకులు (ఫైల్)

రాయచోటి: నదుల్లో నీటి ప్రవాహం పెరగడంతో పరీవాహక ప్రాంతాలకు సరదాగా ఈత కోసం వెళ్లిన యువతీ యువకులు ప్రాణాలు కోల్పోతున్నారు. పచ్చనేతలు తోడేసిన ఇసుక మడుగులు వారిని బలి తీసుకుంటున్నాయి. ఇసుక, మట్టితో పచ్చ నేతలు కోట్ల రూపాయలు ఆర్జిస్తుండగా.. విహార యాత్రలకు, పశువుల కాపర్లుగా వెళ్లిన వారు అర్థాంతరంగా తనువు చాలిస్తున్నారు. ఇంచుమించు కొంత కాలంగా ఈ తరహా ఘటనలు ప్రధానంగా పెన్నా, బహుదా, చెయ్యేరు, పాపాఘ్ని తదితర నదుల మడుగుల్లో వెలుగు చూస్తున్నాయి. మొన్న నెల్లూరు, చిన్న నంద్యాల ఘటనలు మరువకముందే అన్నమయ్య జిల్లాలోని బహుదా నదిలో ఊబిలను తలపించే మడుగుల్లో.. బంగారు భవిష్యత్తు ఉన్న ముగ్గురు ఇంజినీరింగ్ విద్యార్థులు గల్లంతయ్యారు. ఈ మధ్యకాలంలో ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు జిల్లాలోని నదులు ప్రవహిస్తున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర కాలంలో పచ్చ నేతల కనుసన్నల్లో ఇసుక, మట్టి చోరీకి గురైంది. జిల్లాలోని బహుదా, పింఛా, చెయ్యేరు, పెన్నా, మాండవ్య, పాపాఘ్ని నదుల్లో ఎక్కడ చూసినా బావులు, మడుగులను తలపించేలా గుంతలు కనిపిస్తున్నాయి. సరదా కోసం వెళ్లిన యువతీ యువకుల ప్రాణాలను తీస్తున్నది పచ్చ నేతలు తవ్విన ఇసుక మడుగులేనన్న విమర్శలు ఉన్నాయి. ఈ పరిస్థితుల్లోనే గురువారం రాజంపేట సమీపంలోని చెయ్యేరు నదిలో అన్నమాచార్య యూనివర్సిటీలో ఇంజినీరింగ్ చదువుతున్న సాంబత్తిన దిలీప్ (22), కె.చంద్రశేఖర్(22), పి.కేశవ (22)లు ఇసుక మడుగుల్లో ప్రాణాలు వదిలారు.

జాగ్రత్తలు పాటించాలి

ప్రకృతి అందాలు, నదీ ప్రవాహాలు, ప్రాజెక్టుల వీక్షణలో యాత్రికులు తగు జాగ్రత్తలు పాటించాలి. ఇలాంటి ప్రమాదాల నివారణకు అధికారులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నదులు, చెరువులను చెరబట్టిన పచ్చ నేతలు

కూటమి ప్రభుత్వం పాలన ప్రారంభమైన నాటి నుంచి జిల్లాలోని నదులు, చెరువులలోని ఇసుక, మట్టిని చెరబట్టారు. విచ్చలవిడిగా జేసీబీ, ఈటాచ్, బుల్డోజర్లతో నదీగర్భాన్ని చీల్చి టిప్పర్లు, లారీల సాయంతో ఇసుక, మట్టిని దోచుకెళ్లి నదులు, వాగులు, వంకలు, చెరువులకు గర్భశోకాన్ని మిగిల్చారు. అధికారులు ముందుగా గుర్తించి ఇసుక రీచ్‌లను ఎంపిక చేసిన ప్రాంతాలలో.. మనుషుల సాయంతో ట్రాక్టర్లకు ఎత్తుకుని నదుల నుంచి ఇసుకను తరలించాల్సి ఉంది. రీచ్‌లను అధికార బలంతో దక్కించుకున్న తెలుగు తమ్ముళ్లు ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి.. యంత్రాలతో విచ్చలవిడిగా తరలించి ధన దాహం తీర్చుకుంటున్నారు.

సిగ్గు సిగ్గు... మారని తీరు

- కలెక్టర్ పక్కన అధికారిక సమీక్షలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు



కలెక్టర్ నిర్వహించిన అధికారిక సమావేశంలో వేదికపై కూర్చొన్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప ఆర్డీఓ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కడప నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసులురెడ్డి కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పక్కన వేదికపై మళ్లీ ప్రత్యక్షమయ్యారు. ఏ ప్రభుత్వ హోదా లేకపోయినా అధికారిక సమీక్షా సమావేశంలో తన సతీమణి ఎమ్మెల్యే మాధవీరెడ్డితోపాటు వేదికపై ఆయన ఆసీనులయ్యారు. పైగా కడప నియోజకవర్గ అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యల గురించి అధికారులకు ఆదేశాలు ఇవ్వడం గమనార్హం. ఇదంతా స్వయాన కలెక్టర్ సమక్షంలోనే జరిగింది. శ్రీనివాసులురెడ్డికి ఎలాంటి ప్రోటోకాల్ లేకపోయినా దర్జాగా కుర్చీలో ఆసీనులై వేదిక పంచుకుంటున్నా కలెక్టర్ ఏమాత్రం అభ్యంతరం వ్యక్తం చేయకపోవడం పట్ల పలువురు అధికారులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

స్వాతంత్ర్య వేడుకల ఘటన మరువక ముందే..

ఇటీవల స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు పోలీసు పెరేడ్ మైదానంలో జరిగాయి. ఆ సందర్భంగా కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి, ఆమె భర్త టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసులురెడ్డి గంటన్నర ఆలస్యంగా వచ్చారు. దీంతో వేదిక కుడివైపున అధికారులు ఎమ్మెల్యే కోసం ఏర్పాటుచేసిన సోఫాలో ఇతరులు కూర్చొని ఉన్నారు. ఈ విషయం తెలిసిన జిల్లా అధికారులు వారిని అక్కడి నుంచి పంపివేసి ఆసీనులు కావాలంటూ ఎమ్మెల్యేను ఆహ్వానించారు. అయితే తమకు వేదికపై ప్రత్యేకంగా కుర్చీలు ఏర్పాటు చేయలేదంటూ ఎమ్మెల్యే సాక్షాత్తు జేసీ అదితిసింగ్‌పై ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. ఆమె భర్త శ్రీనివాసులురెడ్డి డీఆర్వో విశ్వేశ్వరనాయుడుపై చిందులు తొక్కారు. వేదికపై కూర్చొనేందుకు ప్రోటోకాల్ వీరికి లేకపోయినా అధికారులపై ప్రతాపాన్ని ప్రదర్శించారు. జిల్లా ఉన్నతాధికారులను తీవ్ర మనస్థాపానికి గురి చేసిన ఆ సంఘటన ఇంకా మరిచిపోకముందే మళ్లీ అధికారిక హోదా లేని శ్రీనివాసులురెడ్డి వేదికపై కూర్చున్నారు. అయినా కలెక్టర్ అభ్యంతరం చెప్పలేదు.

ఒంటిమిట్ట అభివృద్ధికి బృహత్తర ప్రణాళిక

ప్రత్యేక నిపుణుల బృందం పరిశీలన



అభివృద్ధి ప్రణాళిక మ్యాప్ పరిశీలిస్తున్న నిపుణుల బృందం

ఒంటిమిట్ట: ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయ అభివృద్ధికి బృహత్తర ప్రణాళిక రూపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తిరుమల తిరుపతి దేవస్థానం వారు ప్రత్యేక నిపుణుల బృందం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా శుక్రవారం ఒంటిమిట్టలో ఎక్కడెక్కడ ఏ పనులు చేస్తే భక్తులకు సౌకర్యంగా ఉంటుందో టీటీడీ సివిల్ విభాగం అధికారులతో కలిసి ప్రత్యేక నిపుణుల బృందం ప్రణాళిక అధికారి రాముడు, ఆర్కిటెక్చర్ అనిల్ పరిశీలించారు. ఈ సందర్భంగా రామాలయ పరిసరాల్లోని రామకుటీరం, శృంగిశైలి పర్వతం, ఒంటిమిట్ట చెరువు, రామతీర్థం, నాగేటితిప్ప పర్వతం, కల్యాణ వేదిక ప్రాంతం, వావిలి కొలను సుబ్బారావు కుటీరాన్ని సందర్శించారు. అనంతరం ప్రణాళిక అధికారి రాముడు మాట్లాడుతూ విజయవాడలో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ నిపుణుల సంస్థ వారి పరిశీలనలో ఎక్కడ అభివృద్ధి జరిగితే భక్తులకు సౌకర్యంగా ఉంటుందో ప్రణాళిక రూపొందించి రాష్ట్ర ప్రభుత్వం, టీటీడీ దృష్టికి తీసుకువెళ్తామన్నారు. ఈ పరిశీలనలో అన్నదాన కాంప్లెక్స్, క్యూ కాంప్లెక్స్, ఒంటిమిట్ట చెరువును ట్యాంక్ బండ్ చేయడం, చెరువులో శ్రీరాముడి భారీ విగ్రహం ప్రతిష్ఠించడం, శృంగిశైలి పర్వతం చుట్టూ గిరి ప్రదక్షిణ చేయించడం, శ్రీరామ ప్రాజెక్ట్, పార్వేటి ఉత్సవం జరిగే నాగేటి తిప్ప పర్వతాన్ని అందంగా తీర్చిదిద్దడం, ఒంటిమిట్ట క్షేత్రానికి విచ్చేసే భక్తులు ఉండేందుకు వసతులు కల్పించడం , ఒంటిమిట్టలో ఎండ తీవ్రతను తగ్గించేందుకు ఎక్కువ ప్లాంటేషన్ చేయించి, సాధారణ ఉష్ణోగ్రత కంటే 6 డిగ్రీలు తగ్గించేలా చర్యలు తీసుకోవడం వంటివి తమ దృష్టిలో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో ప్రశాంతి, సివిల్ విభాగం ఎస్ఈ మనోహర్, ఈఈ సుమతి, ఏఈ అమర్‌నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎరువులు అందుబాటులో ఉన్నాయి

జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి



బ్రహ్మంసాగర్ దగ్గర సాగునీటి ఆయకట్టు మ్యాపును పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలో ఎరువులు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో యూరియా లభ్యతపై జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌తో కలిసి జిల్లా కలెక్టర్ విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ఇప్పటి వరకు ఆర్ఎస్‌కేలలో 3700 టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రైవేట్ ఎరువుల డీలర్స్ నిబంధనల ప్రకారం మాత్రమే ఎరువులను విక్రయించాలన్నారు. బల్క్‌స్టాక్ పెట్టుకుని కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు చేపడతామన్నారు. డీలర్స్ రైతుల డిమాండ్‌ను ఆసరాగా చేసుకుని అనవసరమైన వేరే ఉత్పత్తులను, పోషకాలను లింక్ చేసి అమ్మితే చర్యలు తీసుకొని, వారి లైసెన్సును రద్దు చేస్తామని హెచ్చరించారు. ఆర్ఎస్‌కేలలో, ప్రైవేటు ఫర్టిలైజర్ షాపులలో యూరియా అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఎక్కడైనా యూరియా కొరత ఏర్పడితే 24 గంటల్లో దగ్గర ఉన్న ఆర్ఎస్‌కే ద్వారా అందజేస్తామని తెలిపారు. రైతుల సహాయార్థం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని తెలిపారు. అవసరమైతే కంట్రోల్ రూమ్ నెంబర్లు 8331057300, 9491940106, 8919081933 లలో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ జేడీ చంద్రా నాయక్, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి శ్రీనివాసరావు తదతరులు పాల్గొన్నారు.

బ్రహ్మంసాగర్ పరిశీలన

బ్రహ్మంగారిమఠం: తెలుగు గంగలో అంతర్భాగమైన బ్రహ్మంసాగర్‌ను శుక్రవారం కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరు, ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, ఇన్‌చార్జి ఎస్ఈ వెంకటరామయ్యలు పరిశీలించారు. సాగర్‌లో నీటిమట్టం , ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో , కుడి, ఎడమ కాలువలు పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే సుధాకర్‌యాదవ్‌తో కలిసి సాగునీటి కాలువలకు సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించారు. సాగర్ ఆయకట్టు వివరాల గురించి అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సాగర్‌కు నీరు వస్తుంది కానీ తగిన ఆయకట్టుకు నీరు సరిగా అందకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇందుకోసం పంట కాలువలు తప్పనిసరిగా ఉండాలని అధికారులకు తెలిపారు. ఇందుకోసం అధికారులు ప్రతిపాదనలు సిద్ధంచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బద్వేల్ ఆర్డీఓ చంద్రమోహన్, బద్వేల్ డివిజన్ ఈఈ మధు సూదన్ రెడ్డి, డీఈఈలు, ఏఈఈలు, తహసీల్దార్ కార్తీక్, ఇన్‌చార్జి ఎంపీడీఓ వీరకిషోర్, డీటీ జాన్స్, బి.మఠం సింగల్ విండో అధ్యక్షుడు నేలటూరు సాంబశివారెడ్డి పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రం తనిఖీ

బ్రహ్మంసాగర్ పరిశీలన అనంతరం బద్వేల్‌కు వెళ్లే దారిలో ఉన్న చౌదరవారిపల్లె రైతు సేవాకేంద్రంను కలెక్టర్ శ్రీధర్ చెరుకూరు తనిఖీ చేశారు. అనంతరం చౌదరవారిపల్లె, జి.నరసింహపురం రైతులతో మాట్లాడారు. యూరియా కోసం వచ్చిన రైతులు వ్యవసాయ సమస్యలను వివరించారు. యూరియా కొరతలేకుండా చూడాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రానాయక్ పాల్గొన్నారు.

నిరీక్షణకు తెర

- ఎట్టకేలకు డిగ్రీ ప్రవేశాలకు గ్రీన్ సిగ్నల్
- ఊపిరి పీల్చుకున్న విద్యార్థులు
- ఈనెల 26వ తేదీ వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు



కడపలోని ప్రభుత్వ పురుషుల కళాశాల

కడప ఎడ్యుకేషన్: డిగ్రీ ప్రవేశాలకు సంబంధించి గత నాలుగు నెలల నుంచి నెలకొన్న సందిగ్ధానికి ఎట్టకేలకు ఉన్నత విద్యామండలి గ్రీన్ సిగ్నల్ ఇచ్చి నిరీక్షణకు తెరదించింది. దీంతో డిగ్రీ ప్రవేశాలకు ఎదురు చూసే విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు. ఇంటర్ ఫలితాలు ఏప్రిల్ మాసంలో విడుదలైనా సింగల్, డబుల్ మేజర్ అంటూ దాదాపు నాలుగు నెలలపాటు కాలయాపన చేసిన ఉన్నత విద్యామండలి 20వ తేదీన నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. నూతన జాతీయ విద్యా విధానం అమల్లో భాగంగా సమూల మార్పులతో డిగ్రీ కోర్సులను తీర్చిదిద్ది గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. ఆన్‌లైన్ అడ్మిషన్స్ సింగల్ మేజర్ సబ్జెక్టునే యూజీలో కొనసాగిస్తూ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపింది. ఈ మేరకు జిల్లాలో డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమయింది.

24 నుంచి వెబ్ ఆప్షన్లకు అవకాశం...

డిగ్రీ ప్రవేశాలకు ఈనెల 26వ తేదీలోపు విద్యార్థులు ఆన్‌లైన్ అడ్మిషన్స్ మోడ్యూల్ ఫర్ డిగ్రీ కాలేజెస్(ఓఎంఎండీసీ) వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ పద్ధతిలో తమకు అనుకూలమైన కళాశాలలో డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఇందులో భాగంగా 24వ తేదీ నుంచి 28వ తేదీ వరకు వెబ్ ఆప్షన్ల మార్పునకు వెసులుబాటు కల్పించింది. 31వ తేదీన మెరిట్, రిజర్వేషన్ల ప్రాతిపదికన సీట్లు కేటాయింపు చేయనున్నారు. సెప్టెంబర్ 1వ తేదీ ఆయా కళాశాలల్లో సీట్లు సాధించిన విద్యార్థులు రిపోర్టు చేసి అదే రోజు తరగతులకు హాజరు కావాల్సి ఉంటుంది,

జిల్లాలో కళాశాలల వివరాలు ఇలా...

జిల్లాలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు	14
ప్రైవేటు డిగ్రీ కళాశాలలు	57
ఎయిడెడ్ డిగ్రీ కళాశాలలు	05
జిల్లాలో అడ్మిషన్ల సంఖ్య	10 వేలకు పైగా

జిల్లాలో 76 కళాశాలలలో అడ్మిషన్లు...

జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ కళాశాలల్లో ఎట్టకేలకు ప్రవేశాలు ప్రారంభం కావడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు నెట్ సెంటర్లను ఆశ్రయిస్తున్నారు. జిల్లాలో 76 డిగ్రీ కళాశాలలు ఉండగా ఇందులో 10 వేలకుపైగా డిగ్రీల సీట్లు భర్తీకానున్నాయి. అడ్మిషన్ల ప్రక్రియ దాదాపు నాలుగు నెలలపాటు ఆలస్యం కావడంతో జిల్లాలో చాలా ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు అడ్మిషన్లు 50 శాతం మేర జరిగినట్లు తెలుస్తోంది.



ఫీజు వివరాలు ఇలా...

డిగ్రీలో అడ్మిషన్‌లకు సంబంధించి రిజిస్ట్రేషన్ సమయంలో ప్రాసెసింగ్‌ఫీజు రూపంలో ఓసీ విద్యార్థులు రూ 400, బీసీ రూ. 300, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ. 200 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. అన్ని ధ్రువపత్రాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన విద్యార్థులు వారి పరిశీలనకు హెల్ప్‌లైన్ కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేదు. రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులు కళాశాలలు ఎంపిక చేసుకునేందుకు ఈ నెల 24వ తేదీ నుంచి 28వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాల్సి ఉంది, ఆప్షన్లు మార్చుకునేందుకు 29వ తేదీ అవకాశం ఉంటుంది.

అధిక పత్రాలతో ఇబ్బందులు

అడ్మిషన్లకు సంబంధించిన ఆన్‌లైన్ ప్రక్రియలో భాగంగా సర్వర్ సరిగా పనిచేయడం లేదని పలువురు విద్యార్థులు తెలిపారు. దానికితోడు అధిక పత్రాలను అప్‌లోడ్ చేయాల్సి రావడంతో మధ్యమధ్యలో సర్వర్ సరిగా పనిచేయక ఇబ్బందులకు గురి చేస్తోందని విద్యార్థులు పేర్కొన్నారు. ఇందులో టీసీ, ఎస్ఎస్‌సి మెమో, ఇంటర్ మెమో, 6 నుంచి 12వ తరగతి వరకు సంబంధించిన స్టడీ సర్టిఫికెట్స్, ఫొటో సిగ్నేచర్ పత్రాలను అప్‌లోడ్ చేయాల్సి రావడంతో ఆన్‌లైన్ సరిగా పనిచేయడం లేదని పలువురు అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు?

డిగ్రీలో ప్రవేశాల కోసం ఇప్పటికే ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల అప్లికేషన్స్‌కు ప్రత్యేక హెల్ప్‌లైన్ డెస్క్‌లను ఏర్పాటు చేసి ఆయా కళాశాలల అధ్యాపకులు ఆన్‌లైన్ చేయనున్నట్లు తెలిసింది. ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోని అభ్యర్థులు నేరుగా ఆన్‌లైన్‌లో చేసుకోవచ్చని తెలిసింది. దరఖాస్తు చేసుకునే క్రమంలో సమస్యలు ఎదురైనా, తెలియకపోయినా సమీపంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలల్లోని హెల్ప్‌డెస్క్‌ను సంప్రదించి సందేహాలు నివృత్తి చేసుకునే అవకాశం కల్పించనున్నట్లు తెలిసింది.

కన్నబిడ్డలనే కాడెద్దులుగా చేసుకుని..



ముమ్మడిసిద్దుపల్లె గ్రామ పొలాల్లో కాడెద్దులుగా కలుపు తొలగిస్తున్న అన్నాచెల్లెలు

వ్యవసాయ కూలీల ఖర్చు భరించలేక ఒక రైతు శుక్రవారం తన కుమారుడు, కుమార్తెలకు కాడికట్టి కాడెద్దులుగా చేశాడు. పెండ్లిమర్రి మండలం మమ్మడిసిద్దుపల్లె గ్రామానికి చెందిన బండి చంద్రశేఖర్‌రెడ్డి అనే రైతు తన పొలంలో ఒక ఎకరాలో పూల సాగు చేశాడు. ఇటీవల కురిసిన వర్షాలకు కలుపు ఎక్కువగా ఉండటంతో దానిని తీసేందుకు కూలీలు దొరకక, దూరం నుంచి కూలీలను పిలిపిస్తే ఖర్చు ఎక్కువ అవుతుందని ఇంటర్ చదువుతున్న తన పిల్లలు ప్రహ్లాదరెడ్డి, చామంతిలకు కాడి కట్టి కలుపు తొలగిస్తున్నారు. -పెండ్లిమర్రి

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో రైతు మృతి

మైలవరం : మండలపరిధిలోని వేపరాల గ్రామానికి చెందిన ఏరాసీ సుబ్బరామిరెడ్డి (59) విద్యుదా ఘాతంతో మృతిచెందిన సంఘటన శుక్రవారం మండలంలో చోటు చేసుకొంది. పోలీస్‌ల వివరాల మేరకు.. పెన్నానదిలో తన పొలం కోసం వేసుకున్న బోర్ వద్ద స్టాటర్ తొలగించడానికి వెళ్లి పొరపాటున కరంట్ వైర్లను పట్టుకొని సుబ్బిరామిరెడ్డి మృతి చెందినట్లు తెలిపారు. మైలవరం రిజర్వాయర్ ద్వారా పెన్నానదికి నీరు వదలడంతో తన స్టాటర్ మునిగిపోతుందనే ఉద్దేశంతో తీసివేయాలని వెళ్లి విద్యుత్ ప్రమాదంతో మృతి చెందాడని తెలిపారు.

బైకు ఢీకొని ఇద్దరికి గాయాలు

వేంపల్లె : వేంపల్లె – కడప రోడ్డులో గుర్తుతెలియని బైకు ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. శుక్రవారం తెల్లవారుజామున 3గంటలకు ప్రొద్దుటూరు నుంచి చక్రాయపేట మండలంలో ఉన్న గండి క్షేత్రానికి నడుచుకుంటూ 13 మంది బయలుదేరారు. వేంపల్లె దగ్గర సమీపంలో గుర్తుతెలియని బైకు ఒకసారిగా మీదకు వచ్చింది. దీంతో ఎం.అంజి కుమార్, వాసు తలలకు తీవ్ర గాయాలయ్యాయి. వారి వెనుక వస్తున్న కొందరు గమనించి ప్రథమ చికిత్స కోసం వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బైకు ఢీకొట్టిన వారు అక్కడ నుండి బైకును తీసుకొని పారిపోయారు. గండిక్షేత్రంలో ఉన్న వారి బంధువులకు సమాచారం తెలపడంతో హుటాహుటినా వేంపల్లె ప్రభుత్వాసుపత్రికి వచ్చారు. పోలీసులు సీసీ ఫుటేజీల ఆధారంగా ఢీకొట్టిన బైకును కనుగొని న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

108 అంబులెన్స్‌లో ప్రసవం



అంబులెన్స్‌లోనే మహిళకు కాన్పు చేసిన 108 సిబ్బంది

సింహాద్రిపురం : మండలంలోని రామగిరి గ్రామానికి చెందిన రోషిణి అనే మహిళను శుక్రవారం రెండవ కాన్పు నిమిత్తం 108 వాహనంలో పులివెందుల ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా పురిటి నొప్పులు ఎక్కువవ్వయ్యాయి. 108 వాహన సిబ్బంది ఇఎంటీ గంగాధకర్, పైలెట్ చిరంజీవిలు అంబులెన్స్‌లోనే జాగ్రత్తగా ప్రసవం చేశారు. పండంటి ఆడబిడ్డ పుట్టింది. తల్లికి తగిన వైద్యం అందించి తల్లీ బిడ్డలను క్షేమంగా పులివెందుల ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. దీంతో 108 అంబులెన్స్ సిబ్బందిని ప్రజలు అభినందించి హర్షం వ్యక్తం చేశారు.

గంజాయి వినియోగం, విక్రయాలపై ఆకస్మిక తనిఖీలు



నగర శివార్లలో తనిఖీ చేస్తున్న పోలీసులు

కడప అర్బన్ : ఎస్పీ ఈ.జి అశోక్ కుమార్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా గంజాయి వినియోగం, విక్రయాలపై డీఎస్పీల ఆధ్వర్యంలో శుక్రవారం ఆకస్మిక తనిఖీలను నిర్వహించారు. గంజాయి సేవించే, విక్రయించే అవకాశమున్న ప్రాంతాలు, ప్రదేశాలలో అత్యాధునిక డ్రోన్ కెమెరాల ద్వారా ప్రత్యక్షంగా పోలీస్ అధికారులు పర్యవేక్షించారు. గంజాయి రవాణా చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవనని ఎస్పీ ఈ.జి అశోక్ కుమార్ హెచ్చరించారు. కిరాణా షాపులు, గోడౌన్‌లు, పాడుబడ్డ క్వార్టర్‌లు, భవనాలలో గంజాయి సేవించే, విక్రయించే వారి కోసం సిబ్బందితో అణువణువూ అన్వేషిస్తున్నారు. అసాంఘిక కార్యకలాపాలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాలను జల్లెడ పడుతున్నారు. అనుమానాస్పదంగా సంచరించే వారిపై నిఘా ఉంచడంతో పాటు గంజాయిని సేవించే వారిని గుర్తించేందుకు విస్తత చర్యలు చేపట్టారు. ప్రజలు గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాల గురించిన సమాచారాన్ని టోల్ ఫ్రీ నెంబర్ 1972 కు సమాచారం ఇవ్వాలని కోరారు.

చేయి తడిపితేనే.. ఫైల్ ముందుకు

- అవినీతికి కేరాఫ్ మైలవరం తహసీల్దార్ కార్యాలయం
- ప్రతి పనికీ ఒక రేటు
- చేయి తడపకుంటే నెలల తరబడి సాగదీత
- అధికారులపై సిబ్బంది, సిబ్బందిపై అధికారుల సాకులు



తహసీల్దార్‌కార్యాలయం

మైలవరం : మైలవరం మండల తహసీల్దార్ కార్యాలయంలో అవినీతి మడుగులో కూరుకుపోయింది. ఇక్కడ సామాన్య రైతులకే కాదు.. అధికార పార్టీనేతలకు కూడా సైతం పనులు కావడంలేదు. అది అక్రమమైనా.. సక్రమమైనా చేయి తడిపితేనే ఫైల్ ముందుకు కదులుతుంది. లేదంటే ఎన్ని ఆధారాలు చూపిన నెలలు తరబడి దానిని సాగదీస్తునే ఉంటారు.

సచివాలయాలు వదిలి మండల కేంద్రంలోనే తిష్ట

జగన్ ప్రభుత్వ హాయంలో ఆయా గ్రామాల సచివాలయాల్లో క్రమం తప్పకుండా కనిపించే వీఆర్వోలు ఇప్పుడు మండల తహసీల్దార్ కార్యాలయం వదిలి వెళ్లడంలేదు. వీరికి మండల తహసీల్దార్ కార్యాలయం సైతం ఆసనాలు సైతం ఏర్పాటు చేశారు. వాస్తవానికి గ్రామస్థాయి అధికారులు ఆయా గ్రామాల ప్రజలకు అందుబాటులో ఉండాలనే ఉద్దేశ్యంతో జగన్ ప్రభుత్వం గ్రామ సచివాలయాలను నెలకొల్పింది. వీఆర్వోలకు సైతం అందులో ఒక టేబుల్, కుర్చీ ఏర్పాటు చేసి ప్రతి రోజు అక్కడే హాజరు వేయాలని నిబంధనలు పెట్టింది. దీంతో జగన్ ప్రభుత్వ హాయంలో ప్రతి రోజు వీఆర్వోలు గ్రామ సచివాయాలకు వెళ్లతూ సాయంత్రం ఐదు గంటల వరకు ప్రజలకు అందుబాటులో ఉండేవారు. ఏమంటూ కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిందో గ్రామ సచివాయాలు పూర్తిగా నిర్వీర్యం అయ్యాయి. ముఖ్యంగా మైలవరం మండలానికి చెందిన ఒక్క వీఆర్వో కూడా రోజు సచివాయానికి వెళ్లడంలేదు. వీరంతా మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో తిష్టవేసి కార్యాలయాన్ని అక్కడినుంచే కార్యాకలాపాలను నడిపిస్తున్నారు. పల్లె ప్రజలకు ఏ చిన్న అవసరం వచ్చిన తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లవలసిందే. అక్కడ ప్రతి పనికి ఒక రేటు నిర్ణయిస్తున్నారు. అడిగినంత ముట్టజెబితే ఏ ఆధారాలు లేకపోయిన నిమిషాల్లో పూర్తి చేసి పంపిస్తున్నారు. చేయి తడకపోతే అది ఎంత సక్రమమైన ఫైల్ అయినా వారు కోరిన ఆధారాలు అన్నింటిన్ని సమర్పించినప్పటికీ నెలలతరబడి సాగదీస్తూనే ఉంటారు తప్ప పనిమాత్రం ససేమిరా చేయ్యరు. పై పెచ్చు అధికారులు మీద సిబ్బంది సిబ్బంది మీద అధికారులు ఒకరిపై ఒకరు సాకులు చెబుతూ పొద్దుపొచ్చుతున్నారు.

ఉన్నతాధికారులు దృష్టిసారించలేరనే ధీమా

ఇక్కడ పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది సాక్ష్యాత్తు తహసిల్దార్‌ను సైతం తప్పుదోవ పట్టించిన సంఘటనలు చాలా ఉన్నాయి. అయినప్పటికి తహసీల్దార్ కూడా తప్పు చేసిన సిబ్బందిని మందలించలేకపోతున్నారన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. దీంతో ఇక్కడ సిబ్బంది ఆడింది ఆట పాడింది పాటగా చెలామణి అవుతుంది. ఇటివల చనిపోయిన వ్యక్తి పేరుతో ఓ వ్యక్తి ఫిర్యాదు ఇస్తే దానిని స్వీకరించిన అధికారులు సాక్షాత్తు తహసీల్దార్ సంతకంతోనే బాధిత రైతులకు నోటీసులు జారీ చేశారు. విచారణకు హాజరైన బాధితులు చనిపోయిన వ్యక్తి ఎలా ఫిర్యాదు చేస్తాడని ప్రశ్నించిన అక్కడ సిబ్బంది ఏమాత్రం తొణకకుండా మరో సారి విచారణకు రావాలంటూ హుకుం జారీ చేశారు. ఈ సంఘటనపై సాక్షి దినపత్రికలో ప్రముఖంగా వార్త ప్రచురితం కావడంతో ఉలికి పడ్డ అధికారులు ఆ ఫైల్‌ను మూసివేశారే తప్ప తమ తీరును మార్చుకోలేదు. అందుకు కారణం ఉన్నతాధికారులు ఈ కార్యాలయం వైపు కన్నెత్తి చూడటం లేదని భావన కలుగుతోంది.

కాళ్లు అరిగేలా తిరుగుతున్నా పనిచేయడంలేదు



తమ సొంత భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని శుక్రవారం మైలవరం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన ఓ అధికార పార్టీ కార్యాకర్తను సాక్షి పలుకరించగా ఇక్కడి రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యాన్ని పూసగుచ్చినట్లు వివరించారు. మా అబ్బ బండల పెద్ద బికారి కొన్ని సంవత్సరాల క్రితం దూదేకుల పెద్దయ్యతో భూమిని కొనుగోలు చేశాడు. చిన్న వెంతుర్ల పొలంలో 669/2 సర్వేనంబర్ 1.12 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న భూమికి హక్కుదారుడిగా మా అబ్బపేరు రెవెన్యూ రికార్డుల్లో కనిపించడం లేదు. ఇందుకు సంబంధించి రిజిస్ట్రేషన్ కాగితాలతోపాటు ఈసీ, ఆర్‌హెచ్ ధృవ పత్రాలను రెవెన్యూ అధికారులకు అందజేశాను. అయినప్పటికి అధికారులు సిబ్బందిపై సాకులు చెబుతూ కాలయాపన చెస్తున్నారే తప్ప రెవెన్యూ రికార్డుల్లో మా అబ్బపేరును చేర్చడంలేదు. అన్ని ఆధారాలు సమర్పించిన ఈ ఫైల్ వందశాతం సక్రమమైనని తెలిసిన అధికార పార్టీకార్యకర్తలమైన తమనే కార్యాలయం చుట్టూ తిప్పుకుకంటున్నారు. ఏ పలుకు బడి లేని సామాన్య ప్రజల పనులు ఏ మేరకు జరుగుతాయో మీరే చెప్పాలి. మైలవరం తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న అక్రమాలపై విచారణ జరిపించి అధికారులపై చర్యలు తీసుకోవడంతో పాటు కార్యాలయంలో సంవత్సరాల తరబడి పని చేస్తున్న వారిని ఇక్కడి నుంచి బదిలి చేసి మొత్తం ప్రక్షాళన చేయాలని కోరుకుంటున్నా.

– బండల ఇబ్రహీం, చిన్న వెంతుర్ల, మైలవరం

ఆ ముగ్గురికి మాత్రం చార్జిమెమోలా?

– కడప కేంద్ర కారాగారంలోనైతే 'ఏడుగురు' సస్పెన్షనా

కడప టాస్క్‌ఫోర్స్ : వైఎస్‌ఆర్ జిల్లాలో జైళ్లశాఖ అధికారుల చర్యలు ఒక్కో వ్యవహారంలో ఒక్కో విధంగా వ్యవహరిస్తున్నారనీ ఆరోపణలు వినిపిస్తున్నాయి. కడప కేంద్ర కారాగారంలో ఇటీవల పిడియాక్ట్ రిమాండ్ ఖైదీ జాకీర్ వద్ద దశల వారిగా 12 సెల్‌ఫోన్‌లు, ఒక చార్జర్ లభించాయి. ఈ సంఘటన ను చక్కదిద్దడానికి క్రమశిక్షణా చర్యల క్రింద ఇద్దరు డిప్యూటీ సూపరింటెండెంట్లు, ఇద్దరు జైలర్లు, ముగ్గురు వార్డర్లను సస్పెన్షన్ చేస్తూ విచారణ అధికారిగా వచ్చిన డిఐజీ ఎ.ఆర్ రవికిరణ్ నివేదిక మేరకు రాష్ట్ర డిజి సస్పెన్షన్ వేటు వేశారు. తరువాత రోజుల తరబడిగా విచారణ కొనసాగుతోంది. సాక్షాత్తు రాష్ట్ర డిజి అంజనీకుమార్ కడప కేంద్ర కారాగారంకు వచ్చి విచారణ చేశారు. తరువాత ఇటీవల ప్రొద్దుటూరు సబ్‌జైలుకు చోరీల కేసుల్లో మహమ్మద్ రఫీ అనే 32 కేసులున్న నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. ఈనెల 16తేదీన తెల్లవారు జామునే రిమాండ్‌ఖైదీ పరారయ్యాడు. వారిపై విచారణ అధికారి హుటాహుటిన వెళ్లి సమగ్రంగా విచారణ చేపట్టారు. ఈ క్రమంలోనే అక్కడ పనిచేస్తున్న ముగ్గురికి 'చార్జ్‌మెమోలు' ఇచ్చి 'మమ' అనిపించారు. కడప కేంద్ర కారాగారంలో ఏడుగురిని 'బాధ్యతా రాహిత్యం'గా వ్యవహరించారనీ నివేదికను పంపగా సస్పెన్షన్ చేశారు. రిమాండ్ ఖైదీని కడప కేంద్ర కారాగారంకు పంపించినా, ప్రొద్దుటూరు సబ్ జైలు సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించినా 'రిమాండ్ ఖైదీ పరారీ' సంఘటన జరిగి వుండేది కాదనీ భావిస్తున్నారు. ప్రొద్దుటూరులోని ముగ్గురు సిబ్బందిలో ఒక హెడ్ వార్డర్‌కు కూటమి ప్రభుత్వానికి చెందిన ఓ ఎమ్మెల్యే అండదండలున్నాయనీ సమాచారం.

బాధితులకు న్యాయం చేయాలి

జిల్లా ఎస్పీ ఈ.జి.అశోక్‌కుమార్



ఎస్ఐకు సూచనలిస్తున్న ఎస్పీ ఈ.జి.అశోక్‌కుమార్

బి.కోడూరు : వివిధ సమస్యలపై పోలీసుస్టేషన్‌కు వచ్చే బాధితులకు సత్వరమే న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ ఈ.జి.అశోక్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బి.కోడూరు పోలీసుస్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేషన్‌కు వచ్చే సమస్యలను జిల్లా కేంద్రానికి రాకుండా స్టేషన్‌లోనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎస్ఐను ఆదేశించారు. సీసీటీఎన్ఎస్‌ను అప్‌గ్రేడ్ చేయాలని ఎస్ఐని ఆదేశించడంతో పాటు శక్తిస్కంల ఏర్పాటు గురించి ఎస్ఐని అడిగి తెలుసుకున్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉచితంగా వినియోగంచేలా చర్యలు తీసుకోవాలని ఎస్ఐను ఆదేశించారు. స్టేషన్ పరిధిలో సీసీ కెమెరాల ఏర్పాటుకు తగు చర్యలు చేపట్టాలన్నారు. మట్కా, గ్యాంబ్లింగ్, క్రికెట్ బెట్టింగ్ తదితర అసాంఘీక కార్యకలాపాలు జరగకుండా కఠినంగా వ్యవహరించాలన్నారు. ఆన్‌లైన్ మోసాలపై ప్రజలను చైతన్యపరిచే కార్యక్రమాలు గ్రామాల్లో నిర్వహించాలని సూచించారు. ఉమెన్ హెల్ప్‌డెస్క్‌ను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. మహిళలు, చిన్నారులపై నేరాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పెండింగ్ కేసులు త్వరగా విచారించి పరిష్కరించాలన్నారు. రికార్డులు అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. సిబ్బందితో మాట్లాడి వారికి కేటాయించిన విధుల గురించి తెలుసుకున్నారు. దొంగతనాలు, ఇతర నేరాలు జరగకుండా పగలు, రాత్రి ముమ్మరంగా గస్తీ నిర్వహించాలన్నారు. ఆయన వెంట మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్, ఎస్ఐ వెంకటసురేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఫిర్యాదు దారులకు న్యాయం చేయాలి

చాపాడు : పోలీసుస్టేషన్ కు వచ్చే ఫిర్యాదు దారుల సమస్యలను అడిగి తెలుసుకుని వారికి న్యాయం చేయాలని ఎస్పీ అశోక్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక పోలీసుస్టేషన్‌ను శుక్రవారం ఎస్పీ ఆకస్మిక తనిఖీ చేశారు. పోలీసుస్టేషన్‌కు వచ్చిన పలువురు ఫిర్యాదు దారులతో వారి సమస్యలపై మాట్లాడారు. ఉమెన్ హెల్ప్ డెస్క్‌ను పరిశీలించి కేసుల రికార్డులు, పెండింగ్ కేసులపై ఆరాదీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసుస్టేషన్‌కు న్యాయం కోసం వచ్చే ఫిర్యాదుల సమస్యలను తెలుసుకుని న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

జైళ్లశాఖలో 'ఫెవికాల్ వీరులు'

- కడప రేంజ్ డిఐజీ పరిధిలోనే సంవత్సరాల తరబడి ఉద్యోగాలు
- సీనియర్ అసిస్టెంట్, ఏఓ, ఓఎస్‌లకు ప్రతి ఐదేళ్లకు ఒకసారి బదిలీలు తప్పనిసరి
- ఓడీల పేరుతో ఎక్కడ కావాలంటే అక్కడే డ్యూటీలు

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : జైళ్లశాఖలో ప్రధానంగా కడప రేంజ్ డిఐజీ పరిధిలో పనిచేస్తున్న పరిపాలనా విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగులు మాత్రం తమకు బదిలీలైనా, ఓడిల పేరుతో 'ఫెవికాల్' వీరుల్లా ఎక్కడికక్కడే పనిచేస్తున్నారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి ఐదేళ్ల కాలపరిమితి పూర్తయిన తరువాత 'స్థాన చలనం' అయినా సరే తమ పలుకుబడి తో యథాస్థానంలోనే పనిచేస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. ఐదేళ్ల పూర్తయిన తర్వాత బదిలీలైనా, వాళ్ళ ఎస్సార్లు(సర్వీసు రికార్డులు) పక్క జిల్లాలకు వెళ్లిన వాళ్ల సీట్లు మాత్రం ఇక్కడే! ఏళ్ల తరబడి కారాగార శాఖ సిబ్బంది పాతుకుపోయారు. ఇటీవల బదిలీ అయిన ఏఓ 'ఫెవికాల్ వీరుల'పై తనకు మాత్రమే బదిలీ వర్తిస్తుందా? మిగతా వారికి వర్తించదా? అంటూ జైళ్లశాఖ డిజి అంజనీకుమార్‌కు ఫిర్యాదు చేసింది. ఈఫిర్యాదుపై 'ఫెవికాల్ వీరులు' ఏఓపై గొడవపడినట్లు సమాచారం. డిఐజీలు మారినా, సూపరింటెండెంట్‌లు మారినా, డీఎస్‌జేఓలు మారినా ఫెవికాల్ వీరులను ఎంతమాత్రం చేయలేరని మినిస్టీరియల్ స్టాఫ్‌లో కొందరు, గార్డెన్ స్టాఫ్ కొందరు గుసగుసలాడుకుంటున్నారు. కడప కేంద్ర కారాగారంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ముగ్గురు సీనియర్ అసిస్టెంట్‌లలో ఓ సీనియర్ అసిస్టెంట్ సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి నుంచి సిఫారసు చేయించుకున్నట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. ప్రధానంగా ఏఓ, ఓఎస్, సీనియర్ అసిస్టెంట్‌లకు 'కీలక వ్యవహారం' అన్నీ తెలిసే అవకాశం వుండటం, కొందరు అధికారులకు ప్రయోజనాలు కూర్చడంతో అలాంటి అధికారులు తాము కూడా పట్టిపట్టనట్లు వ్యవహరిస్తున్నారని తెలుస్తోంది.

డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలనకు విద్యాశాఖ కసరత్తు

- త్వరలో సర్టిఫికెట్ల పరిశీలన
- కడపలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల పరిశీలన కేంద్రంగా ఎంపిక

కడప ఎడ్యుకేషన్ : మెగా డీఎస్సీ –2025 అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్స్ పరిశీలనకు విద్యాశాఖ కసరత్తు చేస్తున్నారు. ఇందుకోసం కడప బాలాజీనగర్‌లోని ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాలను పరిశీలన కేంద్రంగా నిర్వహించుటకు అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు అభ్యర్థులు వారి టీమ్‌ల వారిగా పరిశీలన నిమిత్తం ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలకు హాజరుకావాలని విద్యాశాఖ అధికారులు సూచించారు. అభ్యర్థులు తప్పని సరిగా వారి వారి లాగిన్‌లో htt pr://apdrc.apcfrr.in వెబ్‌సైట్ ద్వారా ఇంటిమేషన్ లెటర్‌ను డౌన్‌లోడ్ చేసుకుని అభ్యర్థులు తమకు సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తోపాటు 5 పాస్ పోర్టు ఫోటోలతో పరిశీలనకు హాజరు కావాలి.

17 టీములు ఏర్పాటు ప్ర

సర్టిఫికెట్ల పరిశీలకు సంబంధించి జిల్లా విద్యాశాఖ, రెవెన్యూ అధికారులు దాదాపు 68 మంది 17 టీముల వెరిఫికేషన్ సభ్యులతోపాటు 30 మంది వలంటీర్లు అందుబాటులో ఉంచి పరిశీలనకు సిద్ధం చేస్తున్నారు. అభ్యర్థులు వయస్సు మరియు అర్హతలకు సంబంధించిన అన్ని రకముల సర్టిఫికెట్స్‌తో పాటు అవసరమయిన ఒరిజినల్ పత్రాలు వెంట తెచ్చుకోవాల్సి ఉంటుంది.

ఒరిజినల్ సర్టిఫికెట్లు సిద్ధంగా చేసుకోవాలి



డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులంతా తమకు సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్లను సిద్ధం చేసుకోవాలి. అభ్యర్థులంతా వెబ్‌సైట్ ద్వారా ఇంటిమేషన్ లెటర్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో పాటు 5 పాస్‌పోర్టు ఫోటోలు తీసుకురావాలి. పరిశీలన సమయంలో సంబంధిత పత్రాలు అన్ని అందజేయాలి.

– షేక్ షంషుద్దీన్, జిల్లా విద్యాశాఖ అధికారి

మాజీ ఎమ్మెల్యే రాచమల్లుపై కేసు కొట్టివేత

- పాతబస్టాండ్ కూల్చివేతను అడ్డుకున్నందుకు
- మాజీ ఎమ్మెల్యేతో సహా 27 మందిపై 2018లో కేసు నమోదు

ప్రొద్దుటూరు : మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద రెడ్డిపై పెట్టిన కేసును కొట్టివేస్తూ విజయవాడ స్పెషల్ కోర్టు శుక్రవారం తీర్పు ఇచ్చింది. ఈ కేసులో రాచమల్లుతోసహా మొత్తం 27 మందికి ఊరట లభించింది. వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక పాతబస్టాండ్‌లో ప్రయాణికుల కోసం షెల్టర్ నిర్మించారు. ఈ షెల్టర్ వలన చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చే ప్రయాణికులకు సౌకర్యంగా ఉండటంతోపాటు చిరు వ్యాపారులకు జీవనోపాధి లభించేది. మున్సిపాలిటీ ఆధీనంలో ఈ బస్ షెల్టర్ ఉండేది. 2018 మేలో అప్పటి టీడీపీ ప్రభుత్వం అండతో మున్సిపాలిటీ అనుమతులు లేకుండా బస్ షెల్టర్‌ను కూల్చివేయడం జరిగింది. ఎంతో మందికి జీవనోపాధి కల్పిస్తున్న ఈ బస్ షెల్టర్ తొలగింపుపై మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం లేదు. టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా మాజీ ఎమ్మెల్యేగా ఉన్న వరదరాజులరెడ్డి స్వయంగా సంఘటన స్థలానికి వచ్చి ఆదేశించడంతో వేకువజామునే బస్ షెల్టర్‌ను కూల్చారు. అప్పట్లో ఈ సంఘటన దుమారం రేపింది. బస్ షెల్టర్ తొలగింపు కారణంగా ప్రయాణికులకు ఆసరా లేకపోవడంతోపాటు కూల్‌డ్రింక్స్, అరటి పండ్లు, పండ్లు లాంటి చిరు వ్యాపారులు రోడ్డున పడ్డారు. ఎమ్మెల్యేగా ఉన్న రాచమల్లు శివప్రసాద రెడ్డి స్వయంగా సంఘటన స్థలానికి వచ్చి వ్యాపారులకు అండగా ఆందోళన చేశారు. చిరువ్యాపారులకు ధైర్యాన్ని కల్పించడంతో పాటు ఆర్థికసహాయాన్ని అందిస్తామని తెలిపారు. ఈ సంఘటనపై త్రీటౌన్ పోలీసులు 2018 మే 25న కేసు నమోదు చేశారు. క్రైం నంబర్ 206/18గా నమోదైంది. ప్రభుత్వం అధికారంలో ఉన్న ప్రభావం కారణంగా రాచమల్లు శివప్రసాదరెడ్డి ఫిర్యాదు చేసినా పోలీసులు వరదరాజులరెడ్డిపై కేసు నమోదు చేయలేదు. ఫిర్యాదు చేసిన రాచమల్లుతోపాటు మొత్తం 27 మందిపై కేసు నమోదు కాగా ఇందులో 7 మంది మహిళలు కూడా ఉన్నారు. ఎమ్మెల్యేగా ఉన్న రాచమల్లుపై కేసు నమోదు కావడంతో కేసును విజయవాడ స్పెషల్ కోర్టుకు బదిలీ చేశారు. ఇంతకాలం పాటు వాదోపవాదనలు జరిగినతర్వాత అభియోగాలను నిరూపణ కాకపోవడంతో శుక్రవారం స్పెషల్ కోర్టు కొట్టివేసింది. 27 మందిలో నిందితుడు అల్లుట్ల శంకర్ చనిపోయారు. కాగా 2018లో పాతబస్టాండ్‌లోని షెల్టర్‌ను కూల్చివేయగా వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రాచమల్లు పాత బస్టాండ్‌లో తొలగించిన షెల్టర్ స్థానంలో కొత్తది నిర్మింపజేసి ప్రయాణికులతోపాటు వ్యాపారులకు అండగా నిలిచారు.

న్యాయమే గెలిచింది :

ఈ సందర్భంగా రాచమల్లు శివప్రసాదరెడ్డి సాక్షితో మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలో ఉందని అధికార పార్టీ నేతలు చెప్పినట్లు విని పోలీసులు తప్పుడు కేసులు నమోదు చేయొచ్చు, కానీ న్యాయ స్థానాల్లో తీర్పులు ఇవ్వరు, న్యాయ స్థానాల్లో న్యాయం మాత్రమే లభిస్తుందని, మరేది లభించిందన్నారు. పోలీసులు తమను కొంత ఇబ్బంది పెట్టినా చివరికి న్యాయమే గెలిచింది. ఎప్పటికైనా న్యాయమే నిలుస్తుంది, న్యాయమే గెలుస్తుందని తెలిపారు.

రెండు సచివాలయాల్లో జిల్లా టాస్క్‌ఫోర్స్ టీం పర్యటన



చౌడూరు సచివాలయంలో మాట్లాడుతున్న డీపీఎంఓ డాక్టర్ శశిభూషణ్‌రెడ్డి

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలోని చౌడూరు, కామనూరు గ్రామాల సచివాలయాల్లో శుక్రవారం డీపీఎంఓ డాక్టర్ శశిభూషణ్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా టాస్క్‌ఫోర్స్ టీం పర్యటించింది. ఈ సందర్భంగా డీపీఎంఓ డాక్టర్ శశిభూషణ్‌రెడ్డి మాట్లాడుతూ స్త్రీ గర్భవతిగా నమోదైనప్పటి నుంచి సుఖప్రసవం అయ్యేవరకు అన్ని రకాల ఆరోగ్య సేవలను వైద్యాధికారులు, సిబ్బంది చూసుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. వైద్య సిబ్బందికి ఆశా, అంగన్‌వాడీ, ఆరోగ్య కార్యకర్తలు సహకరించాలని తెలిపారు. ప్రతి ఒక్కరికి ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ ఉండాలని, దీని వలన రాబోయే రోజుల్లో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. అనంతరం ఓపీ రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్, ఈపీఎంయూ నారాయణ, ఎంపీఎస్ రాజశేఖర్, డీపీహెచ్‌ఎన్ఓ శాంతిలత, సీహెచ్ఓ కృష్ణమ్మ, సూపర్‌వైజర్ బీపీ వరప్రసాద్, చంద్రకళ, సీహెచ్ఓలు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికబద్ధంగా వృద్ధి సాధించాలి



– జేసీ అదితిసింగ్

కడప సెవెన్‌రోడ్స్ : ప్రణాళికబద్ధంగా జిల్లా వృద్ధి రేటు 15 శాతానికి పెంచేందుకు కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అన్ని రంగాల్లో వృద్ధి రేటు సాధించాలన్నారు. జిల్లాలో ఉత్పాదతకను పెంచేందుకు కృషి చేయాలన్నారు. పర్యాటక, పశుసంవర్ధకశాఖ, పట్టుపరిశ్రమ, వైద్య ఆరోగ్యం, మార్కెటింగ్, ఆయుష్, ఇరిగేషన్, పరిశ్రమలు, పంచాయతీరాజ్ శాఖలు సూచికల ఆధారంగా సాధించిన లక్ష్యాలను, రానున్న సంవత్సరానికి టార్గెట్‌లపై జేసీ చర్చించారు. కార్యక్రమంలో సీపీఓ హజరతయ్య, పరిశ్రమలశాఖ జీఎం చాంద్‌బాష, ఐసీడీఎస్ అధికారి రమాదేవి, పశుసంవర్ధకశాఖ జేడీ శారదమ్మ, పర్యాటక అధికారి సురేష్, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి పోరాటం



చలో కలెక్టరేట్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తున్నామని, అందులో భాగంగా ఈనెల 25న నిర్వహించే చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరపోగు రవి తెలిపారు. శుక్రవారం నగరంలోని స్థానిక బాలుర ఎస్సీ హాస్టల్‌లో ఎస్ఎఫ్ఐ చలో కలెక్టరేట్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టరేట్ కార్యక్రమాన్ని విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇప్పటికే 14 నెలలు గడుస్తున్నా కనీసం విద్యార్థులకు ఇచ్చినటువంటి హామీలు పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. అలాగే అధికారంలోకి రాకముందు ఇచ్చినటువంటి హామీలు ఏమీ కూడా అమలు చేయలేదన్నారు. ఇందులో భాగంగా జీ.వో నెంబర్ 77 ను వెంటనే రద్దు చేయాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ. 6400 కోట్లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీలు రూ.3 వేలకు పెంచి మెరుగైనటువంటి వసతులు అందించాల్సిందిగా కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఎఫ్ జిల్లా కమిటీ సభ్యులు చారీ, నగర ఉపాధ్యక్షులు శ్రీను, అఖిలేష్, నగర నాయకులు, నవీన్, మనోహర్, నారాయణ, రంగ స్వామి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి ఆత్మహత్యపై పూర్తి దర్యాప్తు చేయాలి

అనుమానాలు వ్యక్తం చేస్తున్న మృతుడి బంధువులు



నరసింహానాయుడు మృతదేహాన్ని పరిశీలిస్తున్న చిన్నాన్న, బంధువులు

వేంపల్లె : ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో గురువారం తెల్లవారుజామున హాస్టల్‌లోని బాత్రూంలో కిటికీకి ఉరి వేసుకుని జి.నరసింహ నాయుడు అనే విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న విషయం అందరికి తెలిసిందే. అయితే మృతుడి ఆత్మహత్యపై బంధువులు పలు అనమానాలు వ్యక్తం చేస్తున్నారు. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం షేర్ మహమ్మదాపురం గ్రామం నుంచి మృతుని చిన్నాన్న ఉమా మహేశ్వరరావు, బంధువులు శుక్రవారం ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీకి చేరుకున్నారు. సంఘటన స్థలాన్ని వారు పరిశీలించి పలు అనుమానాలు వ్యక్తం చేసి ఆర్కే వ్యాలీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తండ్రి చనిపోయినా తల్లి రాజులమ్మ కష్టపడి చదివిస్తుండేది. తమ పిల్లవాడు బాగా చదివేవాడని, మంచి మార్కులు వచ్చేవని తెలిపారు. ఇంటర్మీడియట్ ఫస్టియర్ (పీయూసీ-1) లో కూడా 7.5 గ్రేడింగ్ పాయింట్లు వచ్చాయని, ఆత్మహత్య చేసుకునే అంత పిరికివాడు కాదని బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేంపల్లె ప్రభుత్వాసుపత్రి మార్చురీలో నరసింహానాయుడు మృతదేహాన్ని చిన్నాన్న, బంధువులు చూసి బోరున విలపించారు. విద్యార్థి ఆత్మహత్యపై పలు అనుమానాలు ఉన్నాయని.. పూర్తి దర్యాప్తు నిర్వహించాలని పులివెందుల డీఎస్పీ మురళి నాయక్, సీఐ ఉలసయ్యలను వారు కోరారు. ఆర్కే వ్యాలీ క్యాంపస్‌లో ఉన్న వారు ఆత్మహత్యకు ఎవరైనా సరే తప్పు చేసి ఉంటే వారి పైన కఠినంగా శిక్షించాలని కోరారు. వేంపల్లె ప్రభుత్వాసుపత్రిలో ఉన్న నరసింహానాయుడు మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి తమ స్వగృహానికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో డైరెక్టర్ స్పందించి ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో విద్యార్థికి ఎటువంటి ఇబ్బందులు లేవని తెలిపారు. గత కొన్ని నెలలుగా విద్యార్థి మూడీగా ఉంటున్నట్లు సహచార విద్యార్థులు తమ దృష్టికి తీసుకొచ్చారాన్నారు. అంతేకాకుండా తనకు ట్రిపుల్ ఐటీలో చదవడం ఇష్టంలేదని, నర్సింగ్ చదవాలని స్నేహితులతో చెప్పేవాడన్నారు. విద్యార్థి మొబైల్‌లో ఉన్న నోట్ బుక్‌లో 'ఐ వాంట్ టు డై' సారీ మమ్మీ అని కూడా వ్రాశారని పోలీసుల దర్యాప్తులో తేలిందని చెప్పుకొచ్చారు. అయితే కళాశాల యాజమాన్యం, అటు పోలీసులు పూర్తి విచారణ చేయించి మృతుని కుటుంబానికి ఏమి న్యాయం చేస్తారో వేచి చూడాలి.